క్లుప్తంగా

దివ్యాంగ పిల్లలను భవిత కేంద్రంలో చేర్పించాలి



దివ్యాంగ విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న అధికారులు

హిందూపురం టౌన్: దివ్యాంగ పిల్లలను భవిత కేంద్రంలో చేర్పించాలని ఆల్టర్‌నేటివ్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ ఆనంద్ బాబు తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలో దివ్యాంగ పిల్లలను భవితా కేంద్రంలో చేర్పించేందుకు చేపట్టిన సర్వేను ఆయన ఎంఈఓలు గంగప్ప, ప్రసన్నలక్ష్మీలతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కాలనీలో దివ్యాంగ విద్యార్థిని ఇంటికి వెళ్లి భవిత కేంద్రంలో పిల్లలను చేర్పించడం ద్వారా అందే సేవలు, ప్రభుత్వం ద్వారా అందే పథకాలను వివరించారు. దివ్యాంగ విద్యార్థులు ఉంటే 8300971396 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఐఆర్‌పీ లలిత, సీఆర్‌ఎంటీ ఫైరోజ్, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



నేత్రశిబిరానికి వచ్చిన తల్లీబిడ్డలు

పావగడ: స్థానిక స్వామి వివేకానంద గ్రామీణ ఆరోగ్య కేంద్రంలోని శారదా దేవి కంటి చికిత్స విభాగంలో బుధవారం చిన్నారులకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల నుంచి వందలాది మంది చిన్నారులు తరలి వచ్చారు. ప్రముఖ నేత్ర చికిత్స వైద్యురాలు డాక్టర్ వసుంధర నరేశ్ కంటి పరీక్షలు చేశారు. 13 రోజుల శిశువు నుంచి 15 సంవత్సరాల వయసు ఉన్న పిల్లలకు చికిత్స అందించారు. ఈ శిబిరంలో 22 నెలల పసికందుకు రెండు కళ్లు లోపించడంతో తక్షణమే మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించినట్లు స్వామి జపానంద తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



మాట్లాడుతున్న బీఈఓ ఇంద్రాణమ్మ

పావగడ: తాలూకా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల్ని చేర్పించాలని స్థానిక బీఈఓ ఇంద్రాణమ్మ తల్లిదండ్రులకు సూచించారు. బుధవారం ఆమె తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈనెల 31 నుంచి ప్రభుత్వ పాఠశాలలు పునః ప్రారంభం అవుతాయన్నారు. పాఠశాలల్లో ఉచిత విద్య, ఉచిత యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, షూ, సాక్స్, మధ్యాహ్న భోజనం, పాలు, కోడి గుడ్డు, చిక్కి, అరటి పండ్లు ఉచితంగా అందిస్తామన్నారు. పాఠశాలల ప్రారంభం రోజున తీపి వంటకాలతో పిల్లలకు రుచికరమైన భోజనం వడ్డిస్తామని ఈసీఓ వేణుగోపాల రెడ్డి తెలిపారు.

31న జిల్లా జూనియర్ ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

హిందూపురం టౌన్: పట్టణంలోని ఎంజీఎం క్రీడా మైదానంలో ఈ నెల 31న శ్రీసత్యసాయి జిల్లా ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో జిల్లా జూనియర్ బాలుర ఫుట్‌బాల్ జట్టు ఎంపిక నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు జేవీ అనిల్‌కుమార్, కార్యదర్శి మహమ్మద్ సలీమ్ బుధవారం తెలిపారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు జనవరి 1, 2009 నుంచి డిసెంబర్ 31, 2010 మధ్యలో జన్మించి ఉండాలన్నారు. అలాగే క్రీడాకారులు తమ ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, 4 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, పీసీఎంఏ సర్టిఫికెట్, తల్లిదండ్రుల సమ్మతి పత్రం(కన్సెంట్ ఫారం) తీసుకురావాలని సూచించారు.

ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలి



నిరసన తెలియజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

హిందూపురం: కార్పొరేట్ విద్యాసంస్థలు ముందస్తు అడ్మిషన్ల అరికట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి డిమాండ్ చేశారు. బుధవారం కార్పొరేట్ విద్యాసంస్థల్లో తీరుపై ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా బాబావలి మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు పట్టికను కార్పొరేట్ విద్యాసంస్థలు ఏ పాటించడం లేదని అయినా విద్యాధికారులు ఆ విద్యసంస్థల వైపు కన్నెత్తి కూడా చూడటంలేదన్నారు. విద్యాహక్కు చట్టాన్ని విరుద్ధంగా పాఠశాల, కళాశాలల్లోనే పుస్తకాలను అమ్ముకుటూ రూ.వేలు వసూలు చేస్తున్నారని వాపోయారు. ఆయా విద్యాసంస్థల ప్రచార ఫ్లెక్సీలను తొలగించి ముందస్తుగా అడ్మిషన్లు చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు పట్టికను కచ్చితంగా పాటించేలా చూడాలని కోరారు. నాయకులు చంద్రశేఖర్, నిహాల్, హర్షకుమార్, భగత్, అభి, వినోద్, నవీన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సజావుగా విత్తన వేరుశనగ పంపిణీ



మడకశిరరూరల్: జీపీ పాళ్యంలో విత్తన కాయలను పంపిణీ చేస్తున్న దృశ్యం



అమరాపురంలో విత్తన వేరుశనగ కాయలను పంపిణీ చేస్తున్న దృశ్యం



మడకశిర ఆర్బీకేలో వేరుశనగ కాయలు అందజేస్తున్న ఏఓ తిమ్మప్ప

అగళి: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో బుధవారం విత్తన వేరుశనగ కాయల పంపిణీ ప్రారంభమైంది. ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగుకు సకాలంలో గ్రామ స్థాయిలోనే విత్తన కాయలు పంపిణీ చేస్తామని మండల వ్యవసాయ అధికారి శేఖర్ నాయక్ తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి రైతుకు పంచాయతీ పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో విత్తన వేరుశనగ కాయలు అందజేస్తామన్నారు.

గుడిబండ: మండల వ్యాప్తంగా ఉన్న అన్నీ రైతు భరోసా కేంద్రాల్లో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసేందుకు విత్తన వేరుశనగ పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి వీరనరేష్ తెలిపారు. బుధవారం పలు ఆర్బీకేల్లో రైతులకు విత్తన కాయలు అందజేశారు. ఇప్పటి వరకు నమోదు చేసుకున్న రైతులకు 1,400 క్వింటాళ్ల వేరుశనగ కాయలు అందించామని తెలిపారు.

అమరాపురం: మండలంలోని ఆర్బీకేల ద్వారా పంపిణీ చేస్తున్న సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ మంజునాథ్ తెలిపారు. బుధవారం 15 ఆర్బీకేల్లో 1,441 మంది రైతులకు 4,341 బస్తాల విత్తన కాయలను పంపిణీ చేశామన్నారు. ఇప్పటికీ రిజిస్ట్రేషన్ చేసుకోని రైతులు ఉంటే వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకుని విత్తన వేరుశనగ కాయలను పొందాలన్నారు.

అర్హులందరికీ విత్తన వేరుశనగ

మడకశిరరూరల్: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో బుధవారం సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలను వ్యవసాయశాఖ అధికారులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ తిమ్మప్ప మాట్లాడుతూ.. అర్హత ఉన్న రైతులందరికీ సబ్సిడీ విత్తన కాయలను అందజేయడం జరుగుతుందన్నారు. ఇంకా రిజిస్ట్రేషన్ చేసుకోని రైతులు ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అదే విధంగా కందులు, రాగులకు కూడా నగదు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

విత్తన వేరుశనగ పంపిణీ ప్రారంభం

మడకశిర: పట్టణంలోని ఆర్బీకేలో బుధవారం వేరుశనగ విత్తన కాయల పంపిణీని స్థానిక ఏఓ తిమ్మప్ప ప్రారంభించారు. ముందుగానే పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు విత్తన కాయలను పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా తొలి రోజు 670 మంది రైతులకు 520 క్వింటాళ్ల వేరుశనగ అందజేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. కంది, రాగి విత్తనాలు కూడా ఆర్బీకేల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈవిత్తనాలు అవసరమైన రైతులు కూడా ఆధార్ కార్డు, మొబైల్ నంబర్ తీసుకెళ్లి ఆర్బీకేల్లో ముందుగానే పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఎల్ఆర్‌జీ 52 రకం 4 కేజీల కంది విత్తనాల బ్యాగు ధర రూ.399.40, రెండు కేజీల రాగి విత్తనాల బ్యాగు ధర (ఇంద్రావతి, వేదావతి రకాలు) రూ.72.50 ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో ఆర్బీకే ఇన్‌చార్జ్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి: మండల వ్యాప్తంగా బుధవారం విత్తన వేరుశనగ పంపిణీ ప్రారంభించినట్లు ఏఓ శ్రీలత తెలిపారు. మండలంలోని 12 రైతు భరోసా కేంద్రాల్లో 1,020 మంది రైతులకు 656.7 క్వింటాళ్ల పంపిణీ చేశామన్నారు. ఇప్పటికే ఆర్బీకేల్లో వేరుశనగ విత్తన కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి మాత్రమే పంపిణీ చేస్తామన్నారు.

రొళ్ల: మండల వ్యాప్తంగా 10 రైతు భరోసా కేంద్రాల్లో బుధవారం వ్యవసాయశాఖ ద్వారా రాయితీ విత్తన వేరుశనగ పంపిణీని ప్రారంభించారు. మొదటి విడతలో ఒక్కో ఆర్‌బీకేకు 167 బస్తాలు సరఫరా చేశారని వీఏఏ ప్రసన్నకుమార్ తెలిపారు. 10 ఆర్‌బీకేలకు 500 క్వింటాళ్ల విత్తన కాయలు సరఫరా కాగా.. అందులో 175 క్వింటాళ్ల పంపిణీ చేయడం జరిగిందన్నారు.



అగళిలో వేరుశనగ కాయలను పంపిణీ చేస్తున్న ఏఓ శేఖర్ నాయక్



గుడిబండలో..



లేపాక్షి మండలంలో విత్తన వేరుశనగ పంపిణీ చేస్తున్న దృశ్యం

మండలంలో 144 సెక్షన్ అమలు



రాజకీయ పార్టీల నేతలతో మాట్లాడుతున్న సీఐ ఈరన్న

చిలమత్తూరు: మండలంలో 144 సెక్షన్, 30 యాక్ట్ అమలులో ఉన్నాయని సీఐ ఈరన్న తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జూన్ 4 న కౌంటింగ్ నేపథ్యంలో ప్రజలు గుంపులు, గుంపులుగా ఉండటం నిషేధమన్నారు. విజయోత్సవ ర్యాలీలు, సభలకు అనుమతి లేదన్నారు. బాణాసంచా కాల్చడం, డీజేలకు అనుమతి లేదన్నారు. ఎవరైనా గొడవలు పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియా వేదికగా ఎవరూ రెచ్చగొట్టేలాపోస్టులను పెట్టకూడదని, వాటి కారణంగా ఏవైనా గొడవలు జరిగితే అడ్మిన్లపై చర్యలు తీసుకుంటామన్నారు.

1 నుంచి ఇంటర్ తరగతులు

హిందూపురం టౌన్: పట్టణంలోని చిన్నమార్కెట్‌లో ఉన్న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జూన్ 1 నుంచి తరగతులు ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ బుధవారం పేర్కొన్నారు. ఇంటర్ అడ్మిషన్లు జూన్ 15 వరకు కొనసాగుతాయన్నారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులు తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన ఉందన్నారు. అలాగే ఒకేషనల్ కోర్సుల్లో ఈఈటీ, సీఈటీ, ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్) గ్రూపులు ఉన్నాయన్నారు. పదో తరగతిలో ఉత్తీర్ణులైన వారు కళాశాలలో టీసీ, ఆధార్‌కార్డుతో పాటు పదో తరగతి హాల్ టికెట్ తీసుకొచ్చి అడ్మిషన్లు పొందాలని సూచించారు.

నాడు-నేడు పనులు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంఈఓ-2 చంద్రశేఖర్ నాయుడు

అగళి: మండలంలో నాడు-నేడు కింద ఎంపికైన పాఠశాలల్లో అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంఈఓ-2 చంద్రశేఖర్ నాయుడు సూచించారు. బుధవారం స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది, మధ్యాహ్న భోజన ఏజెన్సీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ-2 చంద్రశేఖర్ నాయుడు మాట్లాడుతూ.. త్వరలోనే పాఠశాలలు పునః ప్రారంభం అవుతాయన్నారు. నాడు-నేడు కింద ఎంపికైన పాఠశాలల పనులను పూర్తి చేయించాలని సూచించారు. అలాగే మండలంలో పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు వంట ఏ విధంగా చేయాలో ఆర్పీ వెంకట లక్ష్మి వీడియోల ద్వారా వివరించారు.

ఘనంగా రామానుజాచార్యుల జయంతి



రామానుజాచార్యుల చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

పావగడ: మంగళవాడ గ్రామంలో బుధవారం రామానుజాచార్యుల జయంతి కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తుమకూరు రామానుజ సహకార సంఘం ప్రముఖుడు చెలువయ్య మాట్లాడారు. రామానుజ తత్త్వ, సిద్ధాంతాలను మనమంతా పాటించాలన్నారు. ఎలాంటి జాతి, మత, వర్గ, లింగ భేదాలు లేకుండా అందరూ ముక్తి మార్గంలో నడవాలని సూచించిన మహాన్ యోగి అని కొనియాడారు. తన 32 వ వయసు లోనే కర్ణాటక రాష్ట్ర వ్యాప్తంగా సంచరించి భక్తి తత్వాన్ని అన్ని సామాజిక వర్గాల వారికి బోధించిన పుణ్య పురుషుడన్నారు. జిల్లా డైరెక్టర్ రఘునాథ్ మాట్లాడుతూ.. అస్పృశ్యతను సమాజం నుంచి పారద్రోలిన మహానుభావుడు రామానుజాచార్యులు అన్నారు. అంటరాని వారిని తన వద్దకు పిలిచి దేవాలయ దర్శన భాగ్యం కల్పించారని పేర్కొన్నారు. అనంతరం రామానుజాచార్యుల చిత్రపటాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో హెగ్గేరి రవి, దర్శన్, గోపాల్, ప్రభాకర్, మడకశిరకు చెందిన వైష్ణవ సంఘం నాయకుడు శ్రీనివాస్, మధుగిరి అశ్వర్థ నారాయణ, పెమ్మనహళ్లి శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వీరశైవ లింగాయత్‌ల సంక్షేమమే ధ్యేయం

అమరాపురం: వీరశైవ లింగాయత్‌ల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నట్లు రాష్ట్ర వీరశైవ లింగాయత్‌ల సంఘం అధ్యక్షుడు శివానంద పేర్కొన్నారు. బుధవారం స్థానిక బసవేశ్వరస్వామి ఆలయంలో స్థానిక సర్పంచ్ వాగేష్ డాక్టర్ బసవరాజు ఆధ్వర్యంలో మండల వీరశైవ లింగాయత్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను విద్యావంతులను చేయాలన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఉన్నత చదువులు చదవడానికి తమ సంఘం తరఫున ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. అలాగే ఐఎఎస్, ఐపీఎస్, తదితర పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న విద్యార్థులకు బెంగళూరులో శిక్షణ ఇవ్వడంతో పాటు తమ పిల్లలకు ఉచితంగా వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. అలాంటి వారు సంప్రదించాలని కోరారు. అనంతరం మండల వీరశైవ అధ్యక్షుడిగా డాక్టర్ బసవరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



మృతుడి భార్య ఉమాదేవికి ఆర్థిక సాయం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప, జెడ్పీటీసీ అనంతరాజు

రొళ్ల: ఈనెల 9వ తేదీన అగళి మండలం కంబదహళ్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ (42) విద్యుత్ షాక్‌తో మృతి చెందిన విషయం తెలిసిందే. బుధవారం సాయంత్రం జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజుతో కలిసి ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప చేతుల మీదుగా రూ.4 లక్షలను మృతుడి భార్య ఉమాదేవికి అందజేశారు. తొలుత రత్నగిరి పంచాయతీ ఆర్.రంగాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కాంతప్పను పరామర్శించారు. అనంతరం జగన్నాథ్ ఇంటి వద్దకు చేరుకుని తేనీటి విందులో పాల్గొన్నారు. అనంతరం రొళ్లలోని మడకశిర రోడ్డులో ఉన్న లక్ష్మీ ప్యాలెస్ కల్యాణ మంటపంలో జరిగిన మోహన్ శామల పెళ్లి రిసెప్షన్ వేడుకలకు హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ లోకేష్, రావుడి ఎంపీటీసీ బసవరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు తొణసనపల్లి బోజేగౌడు, బసవరాజు, నాగరాజు, రేణుకప్ప తదితరులు పాల్గొన్నారు.

కోగిర జయచంద్రకు పురస్కారం



పురస్కారం అందుకున్న కోగిర

పెనుకొండ: పట్టణానికి చెందిన కోగిర జయచంద్ర ఉత్తమ కళాకారుడి పురస్కారం అందుకున్నారు. బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన్ భవన్‌లో జరిగిన పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమంలో ఉత్తమ కళాకారుడిగా ఆయన పురస్కారం అందుకున్నారు. ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌లో ఎన్టీఆర్ సేవా పురస్కారాలను నిర్వాహకులు అందించారు. దీంతో మిమిక్రీతో పాటు ఇతర కళల్లో ప్రావీణ్యం ఉన్న కోగిర జయచంద్రను నిర్వాహకులు సత్కరించి, పురస్కారం ప్రధానం చేశారు.


ఉపాధి కూలీలను ఆదుకోవాలి

సోమందేపల్లి: మండలంలోని ఉపాధి కూలీలను ఆదుకోవాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, ఉపాధ్యక్షుడు బాలస్వామి కోరారు. బుధవారం మండలంలోని పత్తికుంటపల్లి, సోమందేపల్లి చెరువు ప్రాంతంలో జరుగుతున్న ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో వారు మాట్లాడారు. ఉపాధి పని దినాలతోపాటు వేతనాలు పెంచాలని కోరారు.

అనుమానిత వ్యక్తులపై నిఘా

సోమందేపల్లి: గ్రామంలో అనుమానిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ విజయ్‌కుమార్ కోరారు. రెండు రోజుల క్రితం వరుస దొంగతనాలు జరగడంతో నిఘా ఉంచినట్లు ఆయన తెలిపారు. బుధవారం రాత్రి ఎన్టీఆర్ సర్కిల్, పాత ఊరులో మైకుల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. చోరీల నివారణకు ప్రజలకు సహకరించాలని కోరారు. సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏఎస్ఐ మురళి, కానిస్టేబుల్ పాల్గొన్నారు.

నాసిరకం విత్తన కాయలు వెనక్కి పంపిన అధికారులు



విత్తన కాయల నాణ్యతను పరిశీలిస్తున్న రైతులు

గోరంట్ల: ప్రభుత్వం సబ్సిడీతో అందించే విత్తన వేరుశనగ కాయలు నాసిరకంగా ఉండడంతో వెనక్కి పంపినట్లు ఏఓ మునికృష్ణ తెలిపారు. బుధవారం 150 మందికి విత్తన కాయలు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. 333 ప్యాకెట్ల విత్తనకాయలు వచ్చాయని, నాసిరకంగా ఉండడంతో వాటిని వెనక్కి పంపామన్నారు. రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తదుపరి విత్తనకాయలు సరఫరా అయిన తర్వాత వీరికి పంపిణీ చేస్తామని ఏఓ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయం



ఇనగలూరులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

గుడిబండ: నియోజకవర్గంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగుర వేయడం ఖాయమని ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జరిగిన ఓ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అగళి మండలానికి చెందిన మాజీ సర్పంచ్ దేవన్న, శివన్న పాటు పార్టీ శ్రేణులతో కలిసి జరిగిన పోలింగ్ సరళిపై సమీక్షించారు. సీఎం వైఎస్ జగన్ పాలనకు ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. ఎన్నికల సమయంలో ప్రతిపక్ష పార్టీ నాయకుడు చంద్రబాబునాయుడు ఎన్ని మాయమాటలు చెప్పినా ప్రజలు విశ్వసించ లేదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అశ్వత్, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రన్న, నాగరాజు, కరుణాకర్ పాల్గొన్నారు.

అగళి: మండల పరిధిలోని ఇనగలూరలో బుధవారం ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప పర్యటించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేక పోవడంతో నీరంతా రోడ్లపై నిలిచిపోతోందని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప.. ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు కుల, మత, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందించిందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికుట్రలు, కుతంత్రాలు చేసిన కూడా ప్రజలు వైఎస్సార్‌సీపీ అండగా నిలిచారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భర్త నాట రాజు, గిరిష్‌గౌడ్, మైలారప్ప, భోజరాజు, రాజప్ప, మాజీ ఎంపీటీసీ సీతారామప్ప, భోజరాజు, హనుమంతరాయప్ప, నరసింహ మూర్తి, టైలర్ హనుమప్ప, కృష్ణప్ప, రామచంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

కూలీలందరికీ ఉపాధి పనులు



చందకచెర్లలో పనులను పరిశీలిస్తున్న ఏపీఓ శ్రీకాంత్‌గౌడు



రొద్దంలో ఉపాధి హామీపై సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు

మడకశిరరూరల్: ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ శ్రీకాంత్‌గౌడు తెలిపారు. బుధవారం చందకచెర్లు పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. అనంతరం పండ్ల తోటల పెంపకం, పనులపై రైతులు, కూలీలకు అవగాహన కల్పించారు. ఐదు ఎకరాల్లోపు భూమి ఉన్న రైతులు ఉపాధి ద్వారా పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రామస్థాయిలోనే కల్పించే పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బిల్లులు ఆలస్యం చేయకుండా చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

రొద్దం: మండలంలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి పనులను క్వాలిటీ కంట్రోలర్ కృష్ణమోహన్ బుధవారం పరిశీలించారు. పనుల నాణ్యత, మస్టర్‌ను తనిఖీ చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామీణ ఉపాధి హామీ పథకంపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో కూలీల సంఖ్య పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కేశవరెడ్డి, ఏపీఓ అనిల్‌కుమార్, ఈసీ శివప్రసాద్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మండలానికి చేరిన పుస్తకాలు



పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీధర్

రొళ్ల: మండలంలో 2024-25 విద్య సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి ఏడో తరగతి వరకూ చదువుతున్న విద్యార్థులకు మొదటి విడతలో 8,459 పాఠ్యపుస్తకాలు సరఫరా అయినట్లు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. బుధవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో నిల్వ ఉంచిన పాఠ్యపుస్తకాలను పరిశీలించారు. మొత్తం 31,817 పాఠ్యపుస్తకాలు అవసరం ఉన్నట్లు ఉన్నత విద్యాశాఖకు నివేదికలు పంపామన్నారు. మిగిలిన పాఠ్యపుస్తకాలు అందిన వెంటనే పాఠశాల వారీగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. తర్వాత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరుగుతున్న పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలను పరిశీలించారు. రొళ్ల, అగళి మండలాల నుంచి 212 మంది విద్యార్థులు పరీక్షలు హాజరు కావాల్సి ఉండగా 156 మంది పరీక్షలకు హాజరయ్యారు. 56 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

కౌంటింగ్ సమయంలో హద్దు మీరితే కాల్పులే

పెనుకొండ: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సమయంలో అల్లరి మూకలు హద్దు మీరితే చర్యలు తప్పవని పెనుకొండ డీఎస్పీ బాజీజాన్ సైదా హెచ్చరించారు. ప్రశాంతతకు భంగం కలిగిస్తే ఎవరినీ ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. బుధవారం సాయంత్రం డీఎస్పీ నేతృత్వంలో పోలీసులు ప్రత్యేక బలగాలతో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ అనంతరం శాంతియుత వాతావరణం నెలకొనాలన్నారు. అల్లరి మూకలు రెచ్చిపోయి విధ్వంసకర ఘటనలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని గమనించాలని, జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు ఈ హెచ్చరికలు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

అపరిశుభ్రతతో అవస్థలు

పెనుకొండ రూరల్: పెనుకొండ రహదారుల పక్కన, జన సంచార ప్రాంతాల్లో చికెన్, ఇతర వ్యర్థ పదార్థాలు పారవేయడంతో పాదచారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసన భరించలేకపోతున్నామని చెప్తున్నారు. కియా పరిశ్రమ రాకతో గుట్టూరు,అమ్మవారిపల్లి పరిసరాల్లో అనుబంధ సంస్థలు కూడా పెరిగాయి. ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడ వచ్చి నివాసం ఉంటున్న కార్మికుల సంఖ్య కూడా పెరిగింది. దీంతో కమర్షియల్ వ్యాపాలు విచ్చలవిడిగా, రహదారలకు ఇరువైపులా వెలిశాయి.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

గుడిబండ/రొళ్ల : 2024-25 ఆర్థిక సంవత్సరంలో పండ్ల తోటల పెంపకానికి ఆసక్తి ఉన్న రైతులు ఈ వారం లోపు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓలు భార్గవి, ఓబుళప్ప బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుడిబండ మండల వ్యాప్తంగా 550 ఎకరాల్లో పండ్ల మొక్కల పెంపకం చేపట్టేలా చర్యలు చేపట్టామన్నారు. 5 ఎకరాల్లోపు భూములు కలిగిన సన్నకారు రైతులు పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. డ్రైలాండ్ హార్టికల్చర్ ద్వారా కొబ్బరి, చింత, జామ, మామిడి, అల్లనేరేడు, డ్రాగన్‌ఫ్రూట్స్, దానిమ్మతో పాటు పూలతోటలు, మునగ చెట్లు పెంపకానికి అవకాశం ఉందన్నారు. పండ్ల తోటల సాగు చేసే రైతులకు మూడేళ్ల పాటు మొక్కల సంరక్షణ కోసం బిల్లుల రూపంలో చెల్లించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల రైతులు పట్టాదారు పాసుపుస్తకం, సన్న, చిన్నకారు రైతుగా తహసీల్దార్ కార్యాలయంలో అథెంటికేషన్ చేయించుకోవాలన్నారు. ఆధార్, బ్యాంక్‌ఖాతా జిరాక్స్ కాపీలు జత చేసి సంబంధిత క్షేత్ర సహాయకుడికి అందజేయాలన్నారు.

ఆకతాయిలకు అడ్డాగా ప్రభుత్వ పాఠశాల

పెనుకొండ: పట్టణంలోని కొత్తపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మందుబాబులు, ఆకతాయిలకు అడ్డాగా మారింది. రోజూ మందు తాగడం ఇష్టారాజ్యంగా బాటిళ్లను పాఠశాల ఆవరణలోనే పడేస్తున్నారు. కొందరు వ్యక్తులు బయట మద్యం సేవించి బాటిళ్లను పాఠశాల ఆవరణలో పడేస్తున్నారు.

హుండీ కానుకల లెక్కింపు

మడకశిరరూరల్: చందకచెర్ల ఆంజనేయ స్వామి ఆలయంలో బుధవారం దేవదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో హుండీకానుకలను లెక్కించారు. రూ.1.83 లక్షల ఆదాయం సమకూరినట్లు దేవదాయశాఖ అధికారులు తెలిపారు.